నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
I | హైదరాబాద్, గురువారం 24 అక్టోబర్ 2024 | SANGAREDDY

అధికారులను అడ్డుకున్న భూ బాధితులు

జహీరాబాద్, అక్టోబర్ 23 : ఫార్మాసిటీ కోసం సేకరించే భూముల్లో పరీక్షలు చేసేందుకు వచ్చిన భూగర్భ వనరులు, గనుల శాఖాధికారులను భూబాధితులు అడ్డుకున్నారు. బుధవారం సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలోని మల్లి, డప్పూర్, వడ్డి గ్రామాల శివారులో భూముల పరిస్థితిని అధ్యయనం చేసేందుకు వచ్చిన అధికారులను(పరీక్షల కోసం మట్టి, రాళ్లను సేకరిస్తుండగా) భూబాధితులు అడ్డుకున్నారు. తమకు సమాచారం లేకుండా భూముల్లో పరీక్షలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఫార్మాసిటీతో భూములు కోల్పోయిన రైతుల కుటుంబాలు రోడ్డున పాడాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ప్రాణాలు పోయినా భూములు ఇచ్చేది లేదన్నారు.

డప్పూర్-మల్లి గ్రామాల శివారులో మట్టి పరీక్షలు చేసేందుకు వచ్చిన అధికారులు

తమ భూముల్లో ఎలాంటి పరీక్షలు చేయవద్దని అధికారులను అడ్డుకోవడంతో చేసేది ఏమీలేక అక్కడి నుంచి అధికారులు వెనుదిరిగిపోయారు.

పాతూర్ మార్కెట్‌ను సందర్శించిన హరీశ్‌రావు

గజ్వేల్, అక్టోబర్ 23: సిద్దిపేట జిల్లా ప్రజ్ఞాపూర్ రాజీవ్ రహదారి పక్కనున్న పాతూర్ కూరగాయల మార్కెట్‌ను బుధవారం రాత్రి సిద్దిపేట నుంచి హైదరాబాద్ వెళ్తూ మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు సందర్శించారు. రైతులను పలకరించి వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. రైతుల వద్ద కూరగాయలు కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ ఇంతకుముందు రోడ్డుపై అమ్ముకునే వాళ్లమని, మా కష్టాలను చూసిన మీరు మార్కెట్ నిర్మించి ఉపాధి చూపించారని కృతజ్ఞతలు తెలిపారు.

పాతూర్ మార్కెట్‌లో కూరగాయలు అమ్ముతున్న మహిళా రైతులతో మాట్లాడుతున్న హరీశ్‌రావు

పరిహారం..పరిహాసం..!

నిమ్జ్ భూసేకరణ పరిహారం చెల్లింపులో అధికారులు, దళారుల కుమ్మక్కు..?

సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం ఎల్గోయిలో ఏర్పాటు చేసే నిమ్జ్ ప్రాజెక్టు ప్రాంతం

నిమ్జ్‌లో భూములు కోల్పోయిన భూమిలో పంటలు సాగు చేసుకుంటున్న ఎల్గోయి రైతులు

- 1975 నుంచి రికార్డుల్లో ఉన్నా..పరిహారం చెల్లింపులో 17 మంది బాధితులకు అన్యాయం
- బినామీ పేర్లను సృష్టించి పరిహారం చెల్లింపు..?
- జిల్లా అధికారుల చుట్టూ తిరిగినా న్యాయం జరగడం లేదని వాపోతున్నబాధితులు
- అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్

జహీరాబాద్/ఝరాసంగం, అక్టోబర్ 23: నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ మ్యానూఫ్యాక్చర్ జోన్(నిమ్జ్) ప్రాజెక్టు కోసం ప్రభుత్వం సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్, ఝరాసంగం మండలాల్లో భూ సేకరణ చేపడుతున్నది. ఈ భూ సేకరణలో రెవెన్యూ అధికారులు, దళారులు కుమ్మక్కై భారీగా అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఈ ప్రాజెక్టు కోసం ఝరాసంగం, న్యాల్‌కల్ మండలాల్లో 12,635.14 ఎకరాల భూమిని సేకరించేందుకు నోటిఫికేషన్ జారీచేశారు. ఇప్పటివరకు 17 గ్రామాల్లో 7,526.03 ఎకరాల భూమిని సేకరించారు. ఈ భూసేకరణలోనే సంబంధిత నిమ్జ్ ప్రాజెక్టు పనిచేసే అధికారులతో పాటు రెవెన్యూ అధికారులు, సిబ్బంది కలిసి పరిహారం చెల్లింపులో అక్రమాలకు పాల్పడినట్లు బాధిత రైతులు ఆరోపిస్తున్నారు. లంచాలు ఇవ్వలేదనే సాకుతో ఝరాసంగం మండలం ఎల్గోయి గ్రామానికి చెందిన భూ బాధిత రైతులకు సంబంధిత అధికారులు పరిహారం చెల్లించలేదు. దీంతో రెవెన్యూ అధికారులు, దళారులు కుమ్మక్కై రికార్డుల్లో బై నంబర్లతో బినామీ రైతుల పేర్లు సృష్టించి పరిహారం చెల్లించారు. ఈ విషయంలో జిల్లాస్థాయి అధికారులతోపాటు సంబంధిత నిమ్జ్ అధికారుల చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగినా పట్టించుకునే నాథుడే కరువయ్యారని రైతులు వాపోతున్నారు.

మామూళ్లు ఇవ్వలేదనే సాకుతో..

నిమ్జ్ ప్రాజెక్టు కోసం ఝరాసంగం, న్యాల్‌కల్ మండలాల్లో భూసేకరణకు 2011లో కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. 2015-16లో ఝరాసంగం మండలంలో భూ సేకరణకు అధికారులు శ్రీకారం చుట్టారు. ఎల్గోయి గ్రామంలో 2,383.30 ఎకరాల భూమిని అధికారులు సేకరించారు. ఇందులో 1,452 ఎకరాల పట్టాభూమి, 931.26 ఎకరాల ప్రభుత్వ (అసైన్డ్‌ల్యాండ్) భూములు ఉన్నాయి. ఇందులోని అసైన్ భూమి 54 సర్వేనంబర్‌లో 328.10 ఎకరాల భూమి ఉంది. ఆ భూమిలో 1975 నుంచి పట్టాపాసు పుస్తకాలు కలిగి ఉన్న గ్రామానికి చెందిన 17మంది రైతులు పంటలు సాగుచేస్తున్నారు. నిమ్జ్ భూ సేకరణలో బాధిత రైతుల పేర్లు ఉండడంతో పరిహారం మంజూరైంది. బాధిత రైతులు పరిహారం చెక్కులను తీసుకునేందుకు సంబంధిత అధికారుల వద్దకు వెళ్లారు. అయితే పరిహారం చెక్కులు కావాలంటే మామూళ్లు ఇవ్వాల్సిందేనని అధికారులు డిమాండ్ చేశారు. అసలే భూములు కోల్పోతున్నామని, తాము ఎక్కడ నుంచి తెచ్చి మామూళ్లు ఇవ్వాలని అధికారులతో మొరపెట్టుకున్నట్లు బాధిత రైతులు వాపోయారు. దీంతో అప్పట్లో రెవెన్యూ శాఖ కార్యాలయంలో పని చేసే కొందరు అధికారులు, దళారులు కలిసి 2016లో 54 సర్వే నంబర్లకు బై నంబర్లు సృష్టించి బినామీ పేర్లను నమోదు చేశారు. తమకు మాత్రం అధికారులు నష్ట పరిహారం చెల్లించలేదని బాధిత రైతులు ఆరోపిస్తున్నారు. అసైన్డ్ కమిటీ ఆధ్వర్యంలో కొత్తగా పేర్లు నమోదు చేయాల్సి ఉన్నప్పటికీ రెవెన్యూ అధికారులు, దళారులు కుమ్మక్కై బైనంబర్లతో బినామీ పేర్లు ఎలా నమోదు చేస్తారని బాధిత రైతులు ప్రశ్నిస్తున్నారు. అప్పట్లో అసైన్‌మెంట్ కమిటీ లేకున్నా రికార్డులో బై నంబర్లతో కొంత మందికి పరిహారం చెక్కులు అందించినట్లు బాధిత రైతులు ఆరోపిస్తున్నారు. కానీ, 1975 నుంచి భూ రికార్డులు ఉన్న గ్రామానికి చెందిన అర్హులైన 17 మంది రైతులకు నష్టపరిహారం చెల్లించలేదు. ఈ విషయమై సంబంధిత కలెక్టర్, జహీరాబాద్ ఆర్డీవో, నిమ్జ్ అధికారుల చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగినా ఫలితం లేకుండా పోయిందని బాధిత రైతులు పాపోతున్నారు. గతంలో ఝరాసంగం తహసీల్ కార్యాలయంతో పాటు నిమ్జ్ ప్రాజెక్టులో పనిచేసిన అధికారులు కలిసి మామూళ్లు ఇవ్వకపోవడంతోనే బై నంబర్లతో బినామీ పేర్లు నమోదు చేసి తమకు అన్యాయం చేశారని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిమ్జ్ అధికారుల వద్దకు వెళ్లి మొరపెట్టుకుంటే పరిహారం అందరికీ ఇచ్చేశామని, ఇంకెక్కడి నుంచి తెచ్చి ఇవ్వాలని అంటున్నారని బాధిత రైతులు వాపోతున్నారు. సమగ్ర విచారణ చేపట్టి అక్రమాలకు పాల్పడిన అధికారులు, దళారులను గుర్తించి కఠిన చర్యలు తీసుకుని, తమకు న్యాయం చేయాలని బాధిత రైతులు కోరుతున్నారు.

బినామీ పేర్లు సృష్టించి అన్యాయం చేశారు..

1975లో అసైన్‌మెంట్‌లోనే అప్పటి ప్రభుత్వం మాకు సర్వే నంబర్ 54/48లో ఐదు ఎకరాల భూమిని కేటాయించి పట్టాపాస్ పుస్తకాలు ఇచ్చింది. అప్పటి నుంచి భూమి సాగు చేసుకుంటున్నాం. 2016లో నిమ్జ్ భూ సేకరణలో నాకున్న ఐదుఎకరాల భూమి పోయింది. నిమ్జ్‌లో భూమిని కోల్పోవడంతో ప్రభుత్వం నుంచి పరిహారం మంజూరైంది. పరిహారం చెక్కు కోసం అధికారుల వద్దకు వెళ్తే మామూళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లంచాలు ఇవ్వలేనని చెప్పడంతో సర్వే నంబర్ 54లో బై నంబర్లు సృష్టించి బినామీ పేర్లతో పరిహారం చెల్లించారు. నాకు మాత్రం పరిహారం చెక్కు ఇవ్వలేదు. కలెక్టర్, జహీరాబాద్ ఆర్డీవో, నిమ్జ్ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది. మాకు అన్యాయం చేసిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి.

-రాజారావు, రైతు, ఎల్గోయి, ఝరాసంగం మండలం

అధికారులే అన్యాయం చేస్తే ఎట్లా..

సర్వే నంబర్ 54/7లో ఐదు ఎకరాల భూమిని అసైన్‌మెంట్‌లో నా భర్త ఇస్మాయిల్‌కు ప్రభుత్వం కేటాయించింది. అప్పటి నుంచి పంటలు సాగు చేసుకుంటున్నా. నా భర్త చనిపోయాడు. భర్త పేరున భూమిని తన పేరిట మార్చాలని అధికారులకు వద్దకు వెళ్లాను. అంతలోనే నిమ్జ్ భూసేకరణలో ఐదు ఎకరాల భూమి పోయింది. పరిహారం మంజూరైనా అధికారులకు లంచం ఇవ్వకపోవడంతో చెక్కు మాకు ఇవ్వలేదు. 2016 నుంచి అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోవడం లేదు. రికార్డులో మాత్రం నా భర్త పేరు ఉన్నప్పటికీ సర్వే నంబర్ 54కు సంబంధించి 328.10 ఎకరాలకు పరిహారం చెల్లింపు మొత్తం పూర్తయిందని నిమ్జ్ అధికారులు చెబుతున్నారు. పరిహారం ఇవ్వకుండా, భూమిని మార్చకుండా ఇంత అన్యాయం చేస్తారా. మాకు న్యాయం చేయాలి.

-బీపాషా ఇస్మాయిల్, రైతు, ఎల్గోయి, ఝరాసంగం మండలం

పంచాయతీలు మాయం..!

- అన్నిగ్రామ పంచాయతీలు మున్సిపాలిటీల్లో విలీనం..?
- ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్న అధికారులు
- సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గంలో శరవేగంగా కార్యాచరణ అమలు
- నియోజకవర్గ ముఖ్య ప్రజాప్రతినిధి ప్రతిపాదన
- గ్రామాల్లో నిరసనల హోరు.. స్థానిక ప్రజాప్రతినిధుల ఆగ్రహం

పటాన్‌చెరు నియోజకవర్గంలోని చిట్కుల్ గ్రామ పంచాయతీ కార్యాలయం

పటాన్‌చెరు, అక్టోబర్ 23: సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గంలో ఇక మీదట దాదాపు గ్రామ పంచాయతీ అనేది ఉండకపోవచ్చు.ఈ మేరకు ముఖ్య ప్రజాప్రతినిధి చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర ప్రభుత్వం చకచకా చర్యలు తీసుకుంటున్నది. ఈ మధ్యే 11 గ్రామాలను రెండు మున్సిపాలిటీల్లో విలీనం చేసిన సంగతతి తెలిసిందే. రామచంద్రాపురం మండలం, అమీన్‌పూర్ మండలాల్లోని గ్రామాలు వందశాతం మున్సిపాలిటీలుగా మారాయి. పటాన్‌చెరు మండలంలో 19 గ్రామ పంచాయతీల్లో ఐదు తెల్లాపూర్ మున్సిపాలిటీలో కలిపారు. మిగిలిన 14 పంచాయతీలను కూడా ఇస్నాపూర్, భానూర్, ఇంద్రేశం మున్సిపాలిటీలుగా చేసేందుకు పరిశీలన చేసి రిపోర్టు ఇవ్వాలని అధికారులకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. అధికారులు అన్ని గ్రామాల వివరాలను సేకరించి ప్రభుత్వానికి పంపుతున్నారు. మూడు మున్సిపాలిటీలు ఏర్పడితే పటాన్‌చెరు మండలంలో ఒక్క గ్రామపంచాయతీ కూడా ఉండదు. మరో పక్క జిన్నారం మండలంలోని గడ్డపోతారాన్ని మున్సిపాలిటీ చేసేందుకు అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. గుమ్మడిదల మండలంలోని ఆరు గ్రామాలతో గుమ్మడిదలను మున్సిపాలిటీ చేసేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. నియోజకవర్గంలో గుమ్మడిదల మండలంలో ఏడు, జిన్నారం మండలంలో తొమ్మిది గ్రామాలు మాత్రమే పంచాయతీలుగా మిగలనుండగా, వాటిని కూడా మున్సిపాలిటీల్లో విలీనం చేసే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

గ్రామాల్లో నిరసనలు

పటాన్‌చెరు, జిన్నారం, గుమ్మడిదల మండలాల్లో నూతనంగా మున్సిపాలిటీలు ఏర్పాటు చేసేందుకు ముఖ్యప్రజాప్రతినిధి తెచ్చిన ప్రతిపాదనపై గ్రామాల్లో నిరసనలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం కలెక్టర్‌కు ఆదేశాలు ఇవ్వగా, కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు రికార్డులు, రిపోర్టులు సిద్ధం చేస్తున్నారు. వారంక్రితం వరకు పటాన్‌చెరు నియోజకవర్గంలో ఇస్నాపూర్ పంచాయతీ పాశమైలారం, చిట్కుల్‌తో కలిపి మున్సిపాలిటీగా చేస్తున్నారనే ప్రచారం జరిగింది. స్థానికంగా ముఖ్య ప్రజాప్రతినిధి గ్రామాలన్నీ పట్టణీకరణ అవుతున్న సందర్భంగా మొత్తం నియోజకవర్గం మున్సిపాలిటీలుగా చేయాలని సీఎం రేవంత్ రెడ్డికి ప్రతిపాదించారని సమాచారం. ఈ మేరకు ప్రభుత్వం నుంచి మరికొన్ని మున్సిపాలిటీలు ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలు పరిశీలించాలని సంగారెడ్డి కలెక్టర్‌కు ఆదేశాలు వచ్చాయి. దాంట్లో భాగంగా అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. సర్పంచ్‌లు, వార్డు సభ్యులుగా, ఎంపీటీసీలు, ఎంపీపీలుగా, జడ్పీటీసీలుగా పోటీ చేసేందుకు గ్రామాల్లో పలువురు నాయకులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే సర్పంచ్‌లుగా బరిలో ఉంటున్నామని కొందరు రూ.లక్షలు ఖర్చు చేశారు. సామాజిక సేవా కార్యక్రమాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు చందాలు ఇస్తున్నారు. ఇప్పుడు అన్ని గ్రామాలు మున్సిపాలిటీలుగా మారబోతున్నాయని ప్రచారం కావడంతో వారు దిగ్భ్రాంతి చెందుతున్నారు. గ్రామాల్లో నిరసనలు వ్యక్తమవుతున్నాయి. చిన్నపాటి గ్రామాలను సైతం పంచాయతీల నుంచి మున్సిపాలిటీల్లో విలీనం చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీల ఏర్పాటుతో పన్నులు పెరుగుతాయని, పేదల బతుకులు దుర్భరంగా మారుతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్తుల అభిప్రాయాలు తీసుకోకుండా మున్సిపాలిటీల్లో ఎలా కలుపుతారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే తెల్లాపూర్, అమీన్‌పూర్ మండలాల్లో విలీనం చేసిన 11 గ్రామాల ప్రజలకు సేవలు అందడం లేదు. తాగునీరు, సంపూర్ణ పారిశుధ్యానికి నోచుకోవడం లేదనే అంశాన్ని వారు ప్రస్తావిస్తున్నారు.

కొత్త మున్సిపాలిటీల ప్రతిపాదనలు

ఇస్నాపూర్ మున్సిపాలిటీలో చిట్కుల్, రుద్రారం, లక్డారం, పాశమైలారం గ్రామాలు, ఇంద్రేశం మున్సిపాలిటీలో రామేశ్వరంబండ, బచ్చుగూడ, ఐనోల్, చిన్నకంజర్ల, పెద్దకంజర్ల, భానూర్ మున్సిపాలిటీలో నందిగామ, క్యాసారం, గుమ్మడిదల మున్సిపాలిటీలో అన్నారం, బొంతపల్లి, వీరన్నగూడెం, దోమడుగు, మంబాపూర్, గడ్డపోతారం మున్సిపాలిటీలో వావిలాల, లక్ష్మీపతిగూడెం, మాదారం, కాజీపల్లి, నల్తూర్ గ్రామాలు ఉండబోతున్నాయి. వీటికి అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. త్వరలో ఎన్ని మున్సిపాలిటీలు ఏర్పడుతాయి అనేది ప్రభుత్వం తీసుకునే నిర్ణయంపై అధారపడి ఉంటుంది. మున్సిపాలిటీలు ఏర్పాటు చేసేందుకు జనాభా ఎక్కువ ఉండాలి. జనాభా లేని కారణంగానే చుట్టు ఉన్న గ్రామాలను కలిపి జనాభా పెంచే ప్రయత్నం చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

జనాభా లెక్కలు ఇలా...

పటాన్‌చెరు మండలంలోని అన్ని గ్రామాలు మున్సిపాలిటీలో విలీనమయ్యేలా మండల ప్రజాపరిషత్ కార్యాలయం సిబ్బంది ప్రతిపాదించారు. అర్బన్ లక్షణాలు, వేగంగా పట్టణీకరణ జరుగుతున్న గ్రామాలుగా గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు అందజేశారు. మండలంలో మూడు మున్సిపాలిటీలు చేయా లని ప్రతి పాదనలు పంపించారు. ఇప్పటికే ముత్తంగి, కర్ధనూర్, పాటి, ఘనపూర్, పోచారం గ్రామాలు తెల్లాపూర్ మున్సిపాలిటీలో విలీనమయ్యాయి.

- ఇస్నాపూర్ జనాభా 19,136, చిట్కుల్ జనాభా 10,038, రుద్రారం జనాభా 7,425, లక్డారం జనాభా 4,399, పాశమైలారం జనాభా 4,214 ఒక మున్సిపాలిటీగా గుర్తించారు. మొత్తం జనాభా 45,212మంది ఉన్నారు.
- భానూర్ 18,406, నందిగామ 4,585, క్యాసారం 3,010 గుర్తించారు. మొత్తం జనాభా 26,002 మంది ఉన్నారు.
- ఇంద్రేశం జనాభా 5,527, బచ్చుగూడెం 999, రామేశ్వరంబండ జనాభా 4025, ఐనోల్ 4,035, పెద్దకంజర్ల జనాభా 2,182, చిన్న కంజర్ల జనాభా 1,975 మొత్తం జనాభా 16,057 మంది ఉన్నారు.

చెరుకు మద్దతుధరపై సంగారెడ్డి కలెక్టరేట్‌లో సమావేశమైన పరిశ్రమల ప్రతినిధులు, రైతులు, అధికారులు

చెరుకు రైతులకు మద్దతు ధర పెంచాలి

- టన్నుకు రూ.4500 వేలు ఇవ్వాలి
- పరిశ్రమ ప్రతినిధులు, కలెక్టర్ సమక్షంలో రైతు సంఘాల నాయకుల డిమాండ్

సంగారెడ్డి, అక్టోబర్ 23: ఏటా చెరుకు రైతులకు మద్దతు ధర పెంచాలని కలెక్టర్ సమక్షంలో సమావేశాలు నిర్వహిస్తున్నా చక్కెర పరిశ్రమల నుంచి ఎలాంటి మద్దతు ధర పెంపునకు సంబంధించి ప్రకటన రావ డం లేదని భారతీయ కిసాన్ సంఘ్ ప్రతినిధులు కలెక్టర్ వల్లూరు క్రాంతికి వివరించారు. బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన జరిగిన మద్దతు ధర పెంపునకు సంబంధించిన సమావేశంలో బీకేఎస్ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి మాట్లాడారు. ధర పెంపుపై గణపతి చక్కెర కర్మాగారం యాజమాన్యం, గాయత్రి యాజమాన్యం, గంగా కావేరి ప్రతినిధులు సమావేశానికి హాజరైనా ధర పెంచేందుకు సుముఖత చూపలేదన్నారు. చక్కెర పరిశ్రమల ప్రతినిధులు వారు తీసుకున్న నిర్ణయం ప్రకారమే ధర పెంచేందుకు ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. టన్నుకు రూ.4500వేలు ప్రకటించి అమలు చేయాలని, రవాణా, చెరుకు కోతచార్జీల బాధ్యతను యాజమాన్యాలు తీసుకోవాలన్నారు. చెరుకు సాగు విస్తీర్ణం పెరగాలంటే చెరుకు ధర పెంచాలని విన్నవించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రైతుల కోరిక మేరకు యాజమాన్యాలు చెరుకు కోత, రవాణా చార్జీలు భరించాలని పరిశ్రమల ప్రతినిధులకు కలెక్టర్ సూచించారు. దీనికి చక్కెర పరిశ్రమల ప్రతినిధులు స్పందిస్తూ చెరుకు రైతుల డిమాండ్లను ఆయా పరిశ్రమల యాజమాన్యాల దృష్టికి తీసుకువెళ్తామని, ధర విషయంలో వారం రోజుల గడువు ఇవ్వాలని కలెక్టర్‌ను కోరారు. సమావేశంలో సీడీసీ చైర్మన్ గడీల రాంరెడ్డి,అదనపు కలెక్టర్ మాధురి, కెన్ కమిషనర్ రాజశేఖర్, బీకేఎస్ జిల్లా ప్రధానకార్యదర్శి రామకృష్ణారెడ్డి, కోశాధికారి సదానందరెడ్డి, సలహాదారు మురళీధర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు కృష్ణారెడ్డి, వీర న్న విజయేందర్‌రెడ్డి, మొగులయ్య, శ్రీనివా స్, రాములు, నందికంది, పోచారం, ఇరిగిపల్లి, గారకుర్తి, ఆత్మకూర్, చింతలపల్లి, మా రేపల్లి గ్రామాల చెరుకు రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి

- ప్రతిపక్ష పార్టీల నాయకులపై దాడులు చేయడం తగదు
- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి
- సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

మిరుదొడ్డిలో ధాన్యం కొనుగోలు కేందాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

మిరుదొడ్డి, అక్టోబర్ 23: ప్రతిపక్ష పార్టీల నాయకులపై దాడులుచేయడం మానుకొని అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం సిద్దిపేట జిల్లా మిరుదొడ్డితో పాటు చెప్యాల, అల్వాల, లింగుపల్లి, కాసులాబాద్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినా నేటికీ గన్నీ బ్యాగులు కేటాయించలేదన్నారు. ధాన్యం నిల్వ చేయడానికి గోదాములు లేవన్నారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వంలో రైతులకు ఇబ్బందులు లేకుండా తగుజాగ్రత్తలు తీసుకొని కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారని గుర్తుచేశారు. జిల్లా అదనపు కలెక్టర్ వెంటనే చర్యలు తీసుకొని రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోనే దుబ్బాక నియోజకవర్గంలో రైతులు అధికంగా వరిపంట సాగుచేశారన్నారు. ప్రభుత్వం చిల్లర రాజకీయాలు చేస్తూ రైతులకు రైతు భరోసా ఇవ్వ లేదన్నారు. రైతులకు పంట రుణమాఫీ చేసిన దాఖలాలు ఎక్కడా లేవన్నారు. ప్రశ్నించిన ప్రతిపక్షనాయకులపై దాడులు చేయడం సరికాదన్నారు.మల్లన్నసాగర్ ప్రాజెక్టు ద్వారా దుబ్బాక నియోజకవర్గంలోని ఏదు మండలాలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో మల్లన్నసాగర్ ప్రాజెక్టు పిల్ల కాల్వలను త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. మల్లన్నసాగర్ నుంచి హైదరాబాద్‌కు నీటిని తరలించడానికి ప్రభుత్వం పంపుహౌస్‌లను నిర్మిస్తున్నదని, కానీ దుబ్బాక నియోజకవర్గంలోని పిల్ల కాల్వలు పూర్తి చేయడం లేదని మండిపడ్డారు. మల్లన్న సాగర్ వల్ల నియోజకవర్గంలో దెబ్బతిన్న రోడ్ల నిర్మాణానికి నయా పైసా ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రాజలింగారెడ్డి, ఎంపీడీవో గణేశ్‌రెడ్డి, ఏపీఎం దాకయ్య, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అంజిరెడ్డి, ఏఎంసీ మాజీచైర్మన్ సత్యనారాయణ, మాజీ సర్పంచ్‌లు బాల్‌రాజు, బాల్‌నర్సయ్య, బీఆర్ఎస్ నాయకులు లింగం, మల్లేశం, హైమద్, కుమార్, దిలీప్‌రెడ్డి పాల్గొన్నారు.

మృతుడి కుటుంబసభ్యులకు రూ.2లక్షల బీమా చెక్కు అందజేస్తున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

కార్యకర్తలకు అండగా కేసీఆర్

బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి

కొండపాక(కుకునూరుపల్లి), అక్టోబర్ 23: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కార్యకర్తలకు అండగా ఉంటున్నారని ఆ పార్టీ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. బుధవారం సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లి మండలంలోని మేదినిపూర్‌లో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కిష్టాపురం నరసయ్య కుటుంబానికి బీఆర్ఎస్ ప్రమాద బీమాకు సంబంధించి రూ.2లక్షల చెక్కును ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కార్యకర్తలకు అండగా ఉండాలనే లక్ష్యంతో రూ.2లక్షల ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించారన్నారు. బీఆర్ఎస్ సభ్యత్వం తీసుకొని ప్రమాదంతో మృతి చెందిన కార్యకర్తలకు గజ్వేల్ నియోజకవర్గంలో ఇప్పటివరకు సుమారు రూ.7కోట్ల 26 లక్షలు అందజేసినట్లు తెలిపారు. గజ్వేల్ నియోజకవర్గంలో 97వేల మంది బీఆర్ఎస్ సభ్యత్వం కలిగి ఉన్నారన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ డైవర్షన్ రాజకీయాలతో లబ్ధి పొందుతున్నందన్నారు. ఇప్పటివరకు రైతులకు పూర్తిగా రూ.2లక్షల పంటరుణమాఫీ కాలేదని మండిపడ్డారు. ఢిల్లీకి పెద్దఎత్తున డబ్బుల మూటలు పంపించడానికి లక్షా 50కోట్లతో మూసీనది సుందరీకరణకు తెరలేపినట్లు ఆరోపించారు. మూసీనది ప్రాజెక్టుతో ఎన్ని ఎకరాలకు సాగునీరు అందిస్తారని ప్రశ్నించారు. హైదరాబాద్‌లో హైడ్రా బాధితులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని, ఇందు కోసం తెలంగాణ భవన్‌లో లీగల్ సెల్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు ప్రజల సొమ్మును దుర్వినియోగం చేస్తూ ఉత్తరకొరియాకు విహార యాత్ర కోసం వెళ్లారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు దేవీ రవీందర్, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ అమరేందర్, కోల సద్గుణారవీందర్, లక్ష్మణ్, రాజు, దశరథం, నాగరాజు, లగిశెట్టి కనకయ్య, అహ్మద్, సాగర్, సంపత్, లింగం, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భూములకు బదులు భూమివ్వాలి

- బహిరంగ మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లిస్తే భూములిస్తాం
- అధికారులకు స్పష్టం చేసిన గణేశ్‌పూర్ రైతులు

రైతుల సమావేశంలో మాట్లాడుతున్న జహీరాబాద్ నిమ్జ్ ప్రాజెక్టు డిప్యూటీ కలెక్టర్ నాగలక్ష్మి

జహీరాబాద్, అక్టోబర్ 23: నిమ్జ్ ప్రాజెక్టు కోసం సేకరించే భూములకు బదులు భూమిలివ్వాలని, లేదా బహిరంగ మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లిస్తేనే భూములు ఇస్తామని సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం గణేశ్‌పూర్ రైతులు స్పష్టం చేశారు. బుధవారం గ్రామంలో నిమ్జ్ ప్రాజెక్టు కోసం భూమి సేకరించే రైతులతో జహీరాబాద్ నిమ్జ్ ప్రాజెక్టు డిప్యూటీ కలెక్టర్ నాగలక్ష్మి, జహీరాబాద్ ఆర్డీవో రాజు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిమ్జ్ ప్రాజెక్టులో పారిశ్రామల ఏర్పాటుతో నిరుద్యోగులకు